సుస్థిర జీవనోపాధి లక్ష్యంగా 'మహిళా మార్ట్'

లాభాల బాటలో నడిపించేందుకు అవసరమైన శిక్షణ ఇచ్చాం

'మహిళా మార్ట్' ఏర్పాటు పనుల పరిశీలనలో ఖమ్మం కలెక్టర్

ఖమ్మం, మే 13: సుస్థిర జీవనోపాధి లక్ష్యంగా మహిళా మార్ట్ ఉండాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. మహిళా మార్ట్‌ను లాభాల బాటలో నడిపించేలా, మెరుగ్గా నిర్వహించేలా మహిళా సంఘాలకు ముందుగానే శిక్షణ అందించినట్లు చెప్పారు. ఖమ్మం నగరంలోని సీక్వెల్ రోడ్డులో మహిళా మార్ట్ ఏర్పాటు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. మార్ట్‌లో ఏర్పాటు చేసే ఎక్విప్‌మెంట్స్, ప్రొడక్ట్స్ తదితరాలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళా మార్ట్ ప్రారంభించిన తర్వాత దాని నిర్వహణ బాధ్యత స్వశక్తి మహిళా సంఘాలపై మాత్రమే ఉంటుందని అన్నారు. మార్ట్ ముందు భాగంలో ఉన్న ఓపెన్ స్పేస్‌లో రిటైల్ బిజినెస్ కింద ఏర్పాటుచేస్తున్న షాపు ముందు వర్షం వచ్చినా కూడా ఇబ్బంది లేకుండా నీడలో కూర్చొనే విధంగా సీటింగ్ సమకూర్చాలని సూచించారు. అలాగే, పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మహిళా మార్ట్ నిర్వహణ కట్టుదిట్టంగా ఉండాలన్నారు. తక్కువ సామాన్లు ఉన్నప్పటికీ శుభ్రంగా నిర్వహించాలని సూచించారు. డీఆర్‌డీవో సన్యాసయ్య, పీఆర్ ఈఈ వెంకట్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మహిళా మార్ట్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

సంస్థ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ సాలొమోన్

ఖమ్మం, మే 13 : ప్రయాణికులు సంతృప్తి చెందే విధంగా, సంస్థ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పని చేయాలని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ సాలొమోన్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన ఖమ్మం నగరంలోని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కార్యాలయంతోపాటు కొత్త, పాత బస్టాండ్‌లను పరిశీలించారు. డిపోలోని టీ-20 కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరేందుకు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని కోరారు. ప్రయాణికులకు ఇబ్బంది కలిగించకుండా సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వర్తించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. అనంతరం డిస్పెన్సరీని సందర్శించిన ఈడీ వైద్య సేవలపై సమీక్షించారు. ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఖమ్మం ఆర్ఎం సరిరాం, డీఎం దినేశ్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఖమ్మం కొత్త బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ సాలొమోన్

పూసపల్లి ఓసీ లేనట్లేనా?

- జేకే 5 ఓసీ మూసివేత దిశగా పరుగు
- ఇతర ప్రాంతాలకు సర్దుబాటు అవుతున్న కార్మికులు
- జీవనోపాధి లేక తరలిపోతున్న ఇల్లెందువాసులు
- నిరుద్యోగులకు తీవ్ర నిరాశే మిగులుస్తున్న సింగరేణి

ఇల్లెందురూరల్, మే 13 : ఇల్లెందుకు నూతన ఓసీ వస్తే మరో 15 ఏండ్లపాటు మనుగడ కొనసాగించేందుకు వీలుగా ఉంటుందని ప్రజాప్రతినిధులు, సింగరేణి అధికారులు ప్రకటనలు ఇస్తూ ప్రజలు, నిరుద్యోగుల మనసుల్లో నూతన ఆశలు చిగురింపజేశారు. చాలు దేవుడా.. ఇతర ప్రాంతాలకు వెళ్లి నెలకు పదో, పదిహేను వేలకో ఊడిగం చేసేకంటే ఉన్న ఊర్లో ఉండి జీవనోపాధి పొందేందుకు అవకాశం తలుపుతట్టిందని నిరుద్యోగులు భరోసాగా ఉన్నారు. మొన్నటికి మొన్న 21 ఇంక్లైన్ మూతపడగా, జేకే 5 ఓసీ మూతపడే దిశగా అడుగులు వేస్తున్నది. ఇవన్నీ తెలిసి కూడా నూతన ఓసీ వస్తే తమకు జీవనోపాధి లభిస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. తమ తాత, తండ్రులు సింగరేణి సంస్థలో విధులు నిర్వహిస్తూ సంస్థ పురోభివృద్ధికి పాటుపడ్డారు. తాము కూడా పర్మినెంట్ కాకపోయినా ప్రైవేట్ కాంట్రాక్టు కార్మికులుగా ఉంటూ సంస్థ పురోభివృద్ధిలో తమవంతు సహకారం అందిస్తూ జీవనోపాధి పొందవచ్చని అనుకున్నారు. ఒకసారి అనుమతులు రావాల్సిందేనని, మరోసారి సింగరేణి అధికారులు పరిశీలిస్తున్నారని ఇలా పలుమార్లు సింగరేణి యాజమాన్యం ప్రకటనలు చేస్తూ రాగా నిరుద్యోగులు మరింత ధీమాగా ఉన్నారు. అదిగో పులి.. ఇదిగో తోక అన్న చందంలా ఇన్నాళ్లు మాటలు చెబుతూ సింగరేణి అధికారులు నూతన ఓసీ పనులను దాటవేస్తుండడంతో ప్రజలు, నిరుద్యోగుల్లో కొంత అలజడి ప్రారంభమైంది. నూతన ఓసీ రాకపోతే ఇల్లెందు భవిష్యత్తుతోపాటు యువత మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. ఇతర ప్రాంతాలకు వెళ్తే సరైన ఉద్యోగాలు లభిస్తాయా? అన్న మనోవేదనలో యువత ఉన్నారు. కనీసం సింగరేణి సంస్థ యాజమాన్యం నూతన పూసపల్లి ఓసీ గురించి స్పష్టమైన ప్రకటనలు చేయకపోవడంతో మరింత గందరగోళంగా తయారైంది.

రొంపేడు ఇంక్లైన్ ప్రారంభోత్సవం సందర్భంగా వేసిన శిలఫలకం

జేకే 5 ఓసీనే లాస్ట్..

సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో జేకే 5 ఓసీనే చిట్టచివరి మైన్. ప్రస్తుతం ప్రారంభం కానున్న నూతన ఓసీ పూసపల్లిని ప్రైవేట్‌పరం చేసేందుకు యాజమాన్యం సిద్ధమవుతున్నది. సుమారు 130 ఏళ్ల క్రితం సింగరేణిలో ఎంతోమంది కార్మికులు పర్మినెంట్‌గా విధులు నిర్వహిస్తూ వచ్చారు. తాత, తండ్రుల కాలం నుంచి ఇక్కడ ఉన్న వారసులు వారిని చూశారు. ప్రైవేట్‌పరం చేస్తే విధులు నిర్వహించనున్న కార్మికులకు ఎలాంటి మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు ఉండవు. పెన్షన్ సౌకర్యం ఉండదు. సంస్థ నుంచి అనుబంధాలు ఉండకపోవడంతోపాటు పర్మినెంట్ అయ్యే అవకాశాలు పూర్తిగా కోల్పోతారు. ప్రైవేటీకరణతో లాభం కంటే నష్టాలు ఎక్కువగా ఉన్నాయి. కానీ.. ఇల్లెందువాసులు తమ కుటుంబాన్ని పోషించుకునేందుకు, ఉన్న ఊరిలో మనుగడ కొనసాగించాలంటే ప్రైవేట్‌పరంగా ఉద్యోగం చేస్తూ ఓసీ ఉన్నంత కాలంపాటు ముందుకు వెళ్లిపోవాల్సిందే.

పట్టణాలకు తరలుతున్న యువత

రోజురోజుకూ గణనీయంగా పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరల ధాటికి ఇల్లెందు యువత హడలెత్తిపోతున్నది. వయసు పైబడిన తల్లిదండ్రులు, అక్కాచెల్లెళ్ల పెళ్లిళ్లకు, భార్య, సంతానాన్ని పోషించుకునేందుకు ఇతర ప్రాంతాలకు విస్తృతంగా తరలివెళ్తున్నారు. వార్డుల్లో ఎక్కడ చూసినా ఇంటికి వేసిన తాళాలే దర్శనమిస్తాయి. ఎవరిని అడిగినా ఖమ్మం, కొత్తగూడెం, మణుగూరు, పాల్వంచ, హైదరాబాద్‌కు వెళ్లారని వారి బాబుకు అక్కడ ఉద్యోగం వచ్చిందని చెప్పడం సహజంగా మారిపోయింది. ఇక్కడ ప్రస్తుతం వృద్ధులు మాత్రమే ఉన్న ఇంట్లో కనిపిస్తారు. నెలకోసారి ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డ యువత ఇంటికి వచ్చి తల్లిదండ్రులను చూసి వారికి కావాల్సిన నిత్యావసర వస్తువులు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించి వెళ్లడం గమనార్హం. దేశానికి వెలుగులు నింపిన బొగ్గుట్ట నేడు వెలవెలబోతూ కనీసం తన కడుపులో దాచిపెట్టుకున్న ఇల్లెందువాసులకు పట్టెడన్నం కల్పించేందుకు అవకాశం లేకపోవడం విచారకరం. ఇది పాలకుల వైఫల్యమా లేక ఇల్లెందువాసులకు శాపమా.. అనేది సవాలక్ష ప్రశ్నగా మారింది.

ప్రశాంతంగా పాలిసెట్

- ఖమ్మం జిల్లాలో ఐదు కేంద్రాల్లో నిర్వహణ.. 248 మంది విద్యార్థుల గైర్హాజరు
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 3,352 మందికి గాను 3,117 మంది హాజరు
- ఆధార్ కార్డులు కావాలంటూ నిర్వాహకులు చెప్పడంతో విద్యార్థుల ఆందోళన

ఖమ్మం అర్బన్/ కొత్తగూడెం గణేశ్ టెంపుల్/ మణుగూరు టౌన్/ భద్రాచలం/ పాల్వంచ రూరల్, మే 13: పదో తరగతి అనంతరం పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరేందుకు పాలిసెట్-25 ప్రవేశ పరీక్షను మంగళవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనూ నిర్వహించారు. ఖమ్మం నగరంలోని ఐదు కేంద్రాల్లో నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షకు 2,804 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 248 మంది గైర్హాజరయ్యారు. 2,556 మంది హాజరయ్యారు. హాజరైన వారిలో బాలురు 1,395 మంది, బాలికలు 1,161 మంది ఉన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అనుమతి లేదని అధికారులు స్పష్టం చేయడంతో విద్యార్థులు ఉదయం 10 గంటలకల్లా పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన పరీక్ష మధ్యాహ్నం 1:30 గంటల వరకు కొనసాగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా పరీక్షను ప్రశాంతంగా నిర్వహించినట్లు ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్, ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జాకీరుల్లా తెలిపారు.

కొత్తగూడెంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

భద్రాద్రి జిల్లాలో..

పాలిసెట్ ప్రవేశ పరీక్ష భద్రాద్రి జిల్లాలోనూ మంగళవారం ప్రశాంతంగా ముగిసినట్లు పరీక్షల కో ఆర్డినేటర్, రుద్రంపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ బండి శ్రీనివాస్ తెలిపారు. కొత్తగూడెంలో 6, భద్రాచలంలో 2, మణుగూరులో 3 కేంద్రాల్లో పరీక్షను నిర్వహించినట్లు చెప్పారు. మణుగూరులో 618 మంది విద్యార్థులు హాజరయ్యారని, 27 మంది గైర్హాజరయ్యారని, భద్రాచలంలోని 659 హాజరయ్యారని, 60 మంది గైర్హాజరయ్యారని, కొత్తగూడెంలో 1,840 మంది హాజరయ్యారని, 148 మంది గైర్హాజరయ్యారని వివరించారు. భద్రాద్రి జిల్లాలో మొత్తం 3,352 మంది విద్యార్థులకుగాను 3,117 మంది హాజరయ్యారని, 235 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

ఆధార్ కావాలనడంతో ఆందోళన..

పాలిసెట్‌కు హాజరైన విద్యార్థులు తప్పనిసరిగా ఆధార్‌కార్డును చూపించాలంటూ కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ కాలేజీ బాధ్యులు స్పష్టం చేయడంతో ఆధార్‌కార్డు తీసుకురాని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. సమీప ప్రాంతాల విద్యార్థులు కొద్దిమంది తమ ఇళ్లకు వెళ్లి ఆధార్ కార్డు తీసుకొచ్చారు. అయితే, కళాశాల లోపలికి వెళ్లిన విద్యార్థులను కూడా ఆధార్ లేదనే కారణంతో ప్రిన్సిపాల్ బయటకు పంపించారు. దీంతో కళాశాల ఎదుట తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. కళాశాల వద్ద విధులు నిర్వహిస్తున్న వన్ టౌన్ సీఐ కరుణాకర్.. మహిళా కాలేజీ నిర్వాహకులతో చర్చించి ఆధార్ కార్డు లేని విద్యార్థులను కూడా పరీక్ష కేంద్రంలోకి పంపించడంతో వారు పరీక్ష రాశారు. అదేవిధంగా, కేవలం పెన్నులు మాత్రమే తీసుకోవాలని హాల్‌టికెట్‌లో సూచించినప్పటికీ ఓఎంఆర్ షీట్లను పెన్సిళ్లతోనే బబ్లింగ్ చేయాలనడంతో విద్యార్థులు అప్పటికప్పుడు బుక్ షాపులవైపు పరుగులు తీశారు. ప్రియదర్శిని డిగ్రీ కాలేజీలో పరీక్ష రాయాల్సిన ఓ విద్యార్థి పొరపాటున మహిళా కాలేజీకి వచ్చాడు. సమయంలేకపోవడంతో నిరాశతో వెను తిరుగుతున్న ఆ విద్యార్థిని వన్‌టౌన్ సీఐ కరుణాకర్ తన వాహనంలో ఎక్కించుకొని పరీక్ష కేంద్రానికి చేర్చారు.

ఖమ్మంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయురాలు

'ఆర్‌యూవీ' దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయండి

టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, మే 13 (నమస్తే తెలంగాణ) : రాజీవ్ యువ వికాసం(ఆర్‌యూవీ) పథకంలో వచ్చిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇండ్లు తదితర పథకాల అమలుపై ఐటీడీఏ పీవో రాహుల్‌తో కలిసి సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్‌యూవీ పథకానికి వచ్చిన దరఖాస్తుల పరిశీలన త్వరితగతిన పూర్తి చేసి అర్హులైన వారి జాబితా రూపొందించాలన్నారు. బ్యాంకర్ల సమన్వయంతో ఆధార్, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, శాశ్వత డ్రైవింగ్ లైసెన్సు, పట్టాదారు పాస్ పుస్తకం, సదరం సర్టిఫికెట్ తదితర ధ్రువ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి సిబిల్ స్కోర్ ఆధారంగా అర్హులను ఎంపిక చేయాలన్నారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ప్రతీ నియోజకవర్గంలో 3,500 ఇండ్లకు గాను.. ఇప్పటికే మొదటి విడతలో మండలానికి ఒక పంచాయతీని ఎంపిక చేశారని, మిగిలిన పంచాయతీల్లో అర్హుల జాబితాను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రాబోయే వర్షాకాలంలో ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టే విధంగా ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. చేపట్టిన ప్రతి ఇంకుడు గుంత ఫొటోను జేఎస్‌జేబీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. దేశంలోనే ఇంకుడు గుంతల నిర్మాణంలో మన జిల్లా మొదటి స్థానానికి చేరువలో ఉన్నదని, మొదటి స్థానం పొందిన వారికి రూ.రెండు కోట్ల బహుమానం లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.

కలెక్టర్ జితేశ్ వి పాటిల్

ఇల్లెందు ఏరియాలో సీఎండీ పర్యటన

ఇల్లెందు, మే 13 : ఇల్లెందు సింగరేణి ఏరియాలో సంస్థ సీఎండీ ఎన్.బలరాం డైరెక్టర్లు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, సూర్యనారాయణతో కలిసి కేవోవోసీ, జేకే ఓసీలలో మంగళవారం విస్తృతంగా పర్యటించారు. కోయగూడెం ఓసీలో వ్యూ పాయింట్ వద్ద బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రక్షణ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. అనంతరం జీఎం కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. నూతన జేకే కోల్‌మైన్ ఉపరితల గని వద్ద జరుగుతున్న పనుల పురోగతిపై ఏరియా జీఎం కృష్ణయ్యను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సింగరేణి అధికారులు రామస్వామి, కృష్ణ, మోహన్‌రావు, రవికుమార్, రమామూర్తి, మధుబాబు, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు వివరాలను పరిశీలిస్తున్న బలరాం, డైరెక్టర్లు

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

డాక్టర్ జే.హేమంత్‌కుమార్

అశ్వారావుపేట/ దమ్మపేట రూరల్, మే 13 : చదువుతోపాటు ఆసక్తి గల రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జే.హేమంత్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. తద్వారా భవిష్యత్ లక్ష్యాలను సులభంగా సాధించుకోవచ్చని చెప్పారు. అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాలలో మంగళవారం హైదరాబాద్‌కు చెందిన ఇక్కా ఫౌండేషన్... విద్యార్థులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. కార్యక్రమాన్ని ప్రారంభించిన అసోసియేట్ డీన్ విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కిషోర్, ఎస్సీ, ఎస్టీ సెల్ కో-ఆర్డినేటర్ కె.కోటేశ్వరరావు, డాక్టర్ ఎం.రాంప్రసాద్, డాక్టర్ ఐ.కృష్ణ తేజ, డాక్టర్ ఆర్.రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న హేమంత్‌కుమార్

పచ్చిరొట్ట పైర్ల సాగు ఎంతో మేలు..

పచ్చిరొట్ట పైర్ల సాగుతో నేలలో కర్బన పదార్థం వృద్ధి చెందుతుందని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జే.హేమంత్‌కుమార్ అన్నారు. దమ్మపేట మండలం మందలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తల కార్యక్రమం డాక్టర్ శిరీష, డాక్టర్ జంబమ్మల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా హేమంత్‌కుమార్ మాట్లాడుతూ వేసవిలో జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట పైర్లు చల్లుకుని పెరిగిన తరువాత భూమిలో కలియదున్నుకోవడం వలన కర్బనం పుష్కలంగా వృద్ధి చెందుతుందన్నారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ కాలానికి అనుగుణంగా రైతులు మార్పు చెంది లాభదాయకమైన పద్ధతులను పాటించాలన్నారు. వరి సాగులో నేరుగా విత్తనాలను చల్లుకోవాలన్నారు. నీటిని ఆదా చేయడంతోపాటు కూలీల కొరతను అధిగమించవచ్చన్నారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి సందీప్, వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.